క్లుప్తంగా

మృత్యుంజయ స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో మృత్యుంజయస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామికి సోమవారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా గణపతి పూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళ్ల, పసుపు, కుంకుమ, విభూది వంటి వాటితో అభిషేకాలు చేశారు. అనంతరం సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఎన్నిక



నూతన సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి: పట్టణంలో సోమవారం కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఎన్నిక నిర్వహించారు. శ్రీకాళహస్తి అసోసియేషన్ అధ్యక్షుడిగా బొమ్మన మధుసూదన్‌రావు, ఉపాధ్యక్షుడిగా చక్రపాణి, కార్యదర్శిగా కొండేటి గోపాల్, కోశాధికారిగా పెళ్లూరు కార్తీక్‌రెడ్డిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అమరా జనార్దన్‌రావు, జిల్లా కార్యదర్శి సుబ్బరామ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ



పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నాగలాపురం/సత్యవేడు: మండలాల పరిధిలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చేతుల మీదుగా లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. తొట్టంబేడు మండలం తంగేళ్లపాళెం పంచాయతీలో మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు వృద్ధులకు పింఛన్లను అందజేశారు.
శ్రీకాళహస్తి: మండలంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ, సతీమణి రిషితారెడ్డి, టీడీపీ నాయకులు, బీజేపీ నాయకులు కోలా ఆనంద్, జనసేన నాయకులు వినుత పింఛన్లు పంపిణీ చేశారు.
వరదయ్యపాళెం: మండలంలో 93శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు.

మాట నిలబెట్టుకున్న తంబిరెడ్డి



నిరుపేద మహిళకు నగదు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నాయుడుపేట టౌన్ : వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి సోమవారం నిరుపేద ఒంటరి మహిళ ముంతాజ్ అలియాస్ బుజ్జమ్మకు సోమవారం పింఛను నగదు అందజేసి మాట నిలబెట్టుకున్నారు. మునిరత్నం నగర్‌కు చెందిన బుజ్జమ్మకు సాంకేతిక కారణాలతో గతంలో పింఛన్ ఆగిపోయింది. ఆమె దీనస్థితి గురించి తెలుసుకున్న టీఎంఆర్ గ్రూపు సంస్థల అధినేత జనార్దన్ రెడ్డి మూడు నెలలుగా బుజ్జమ్మకు నగదు అందజేస్తున్నారు. సోమవారం కూడా పింఛను మొత్తానికి సరపడా నగదు అందజేశారు. తిరిగి ప్రభుత్వం ఆమెకు పింఛను మంజూరు చేసే వరకు సహాయం చేస్తానని తంబిరెడ్డి తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు ముత్యాలరెడ్డి, పగడాల ప్రదీప్, సాయి పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

చిల్లకూరు : పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన పారిచెర్లవారిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినికి ఇంటర్‌లో చేరేందుకు అవసరమైన ఖర్చుల నిమిత్తం రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు సోమవారం రూ.10 వేల సాయం అందించారు. ట్రస్టు చైర్మన్ రాజనేని పిచ్చయ్య నాయుడు మాట్లాడుతూ తన కుమారుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంస్థ ద్వారా ఎంతో మంది పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్నట్టు చెప్పారు. ఈ క్రమంలోనే పారిచెర్లవారిపాళెంకు చెందిన పేద విద్యార్థిని ఎస్‌కే సాజీదా పదో తరగతిలో 539 మార్కులు సాధించిందని, ఇంటర్‌లో చేరేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నట్టు తెలిసి సాయం అందించినట్టు తెలిపారు. పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం చంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బడిబయట పిల్లలు బడిలో చేరిక





బుచ్చినాయుడు కండ్రిగ: పాఠశాలలో చేరిన విద్యార్థులతో ఎంఈఓలు, ఏర్పేడు: కిట్స్ అందజేస్తున్న హెచ్‌ఎం నిర్మల్‌కుమార్, నారాయణ వనం: బడి మానేసిన బాలిక తండ్రితో మాట్లాడుతున్న అధికారులు

- గ్రామాల్లో ముమ్మరంగా సాగుతున్న 'నేను బడికిపోతా'
- తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న విద్యాశాఖాధికారులు
- స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పెద్దపాలేడు గ్రామ పంచాయతీ పరిధిలోని మూలబొందల గిరిజన కాలనీలో బడి మానేసిన బడి ఈడు పిల్లలు సోమవారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో చేర్పించినట్లు ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం బడి ఈడు పిల్లలంతా బడిలో ఉండాలని తెలిపారు. బడి మానేసిన పిల్లలను బడిలో చేర్పించేందుకు తల్లిదండ్రులు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పండి

ఏర్పేడు: బడిఈడు పిల్లలను బడిలో చేర్చాలని ప్రధానోపాధ్యాయుడు నిర్మల్‌కుమార్ అన్నారు. మండలంలోని బండారుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ చేసి, విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులు ఉన్నట్లు వివరించారు. గ్రామాల్లో బడిఈడు పిల్లలను గుర్తించి బడిలో చేర్చాలని సూచించారు. విద్యార్థులు చదివి ఉన్నత స్థానాలకు వెళ్లాలని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివారెడ్డి, రెడ్డివారి గురవారెడ్డి, ఉపాధ్యాయులు సుబ్రమణ్యం, గుణశేఖర్‌రెడ్డి, ద్వారకానాథరెడ్డి, రాధాకుమారి, వెంకటేశులు, కుమారరాజా, ఉమామహేశ్వర్, రాధాకుమారి, సీఆర్పీ వెంకటముని రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు తమ పిల్లలను విధిగా బడికి పంపాలి

నారాయణవనం: బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని తల్లిదండ్రులు తమ పిల్లలను విధిగా బడికి పంపాలని అధికారులు అన్నారు. సోమవారం పుత్తూరు డిప్యూటీ డీఈవో, మండల ఎంఈఓ ప్రభాకర్‌రాజుతో కలిసి తహసీల్దార్ శంకరరావు, ఎంపీడీఓ కృష్ణమూర్తి మండలంలోని అరణ్యంకండ్రిగ పంచాయతీలో 'నేను బడికి పోతా' కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి పడివేటమ్మ ఎస్టీ కాలనీలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బడి మానేసిన ముత్తు, వైష్ణవి, పూజ, సుభల తల్లిదండ్రులతో అధికారులు మాట్లాడారు. చదువు ఆవశ్యకతను వివరిస్తూ, ప్రభుత్వం విద్యారంగం అభివృద్ధి కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. తిరిగి బడి మానేసిన నలుగురిని అరణ్యకండ్రిగ ఉన్నత పాఠశాలలో రీజాయిన్ చేయించినట్లు ఎంఈఓ ప్రభాకర్ రాజు తెలిపారు. వివిధ కారణాలతో బడికి దూరమైన విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి తిరిగి హాజరయ్యేలా ఉపాధ్యాయులను ఆదేశించామని ప్రభాకర్‌రాజు తెలిపారు. మండలంలో వందశాతం పిల్లలు బడిలోనే ఉండాలని ఆయన అన్నారు.

యల్లమ్మ తల్లికి పొంగళ్లు



విశేషాలంకరణలో యల్లమ్మ తల్లి

ఏర్పేడు: మండలంలోని ఎండీ పుత్తూరు యల్లమ్మ తల్లి ఆలయం వార్షికోత్సవం సందర్భంగా సోమవారం గ్రామస్తులు పొంగళ్లు సమర్పించారు. అమ్మవారి విగ్రహానికి విశేషాలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పూజారి అభిషేకాలు చేశారు. మహిళలు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి అమ్మవారికి ధూప దీప, నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం అమ్మవారిని పుర వీధుల్లో ఊరేగించారు. ప్రతి ఏడాది గ్రామస్తులు అమ్మవారికి పొంగళ్లపెట్టేది ఆనవాయితీగా వస్తోంది. కార్యక్రమంలో సర్పంచ్ మోహనప్రియ పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్స్‌డే వేడుకలు



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ బత్తెయ్యనాయుడు

శ్రీకాళహస్తి: పట్టణంలో ఘనంగా డాక్టర్స్‌డే వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా పట్టణంలోని పీపుల్స్ నర్సింగ్ హోమ్‌లో డాక్టర్ బత్తెయ్యనాయుడు ఆధ్వర్యంలో డాక్టర్స్ డే వేడుకలను నిర్వహించారు. డాక్టర్స్‌డే విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో నాగూరయ్య, వెంకటముని, గోపి, వీరరాఘవ రెడ్డి, శివయ్య పాల్గొన్నారు. ఎంజీఎం ఆస్పత్రి డైరెక్టర్ గుడ్లూరు మయూర్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే వేడుకలు నిర్వహించారు. శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, నాయుడుపేట తదితర ప్రాంతాల నుంచి సుమారు వంద మంది వైద్యులు వచ్చారు. వారి సేవలను ఆయన కొనియాడారు. తమ ఆస్పత్రిలో ఉన్న వసతులను వివరించారు. 24 గంటలు వైద్యసేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంజీఎం ఆస్పత్రి డైరెక్టర్ మయూర్

రేషన్ సరుకులను సక్రమంగా ఇవ్వాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ మహ్మద్ పటాన్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని చౌకదుకాణాల డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దారు మహ్మద్ పటాన్ అలీఖాన్ తెలిపారు. సోమవారం ఆయన మండలంలోని నీర్పాకోట, తానిగిల్లు గ్రామాల్లో ఎండీయూ వాహనాలలో సరుకుల పంపిణీ పరిశీలించి, డీలర్లతో మాట్లాడి, కార్యాలయంలో పౌరసరఫరాల శాఖ అధికారి నాగరాజురెడ్డితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌకదుకాణాల్లో సరుకుల పంపిణీ గురించి గ్రామాల్లో టాంటాం వేయాలన్నారు. సకాలంలో డీడీలను కట్టాలని, ఎండీయూ ఆపరేటర్లు సరుకులను కార్డుదారులకు సక్రమంగా పంపిణీ చేయాలని కోరారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకై సరుకులను అమ్మాలన్నారు. కార్డులోని ప్రతి ఒక్కరికీ ఐదు కేజీల బియ్యాన్ని కార్డుదారులకు అందించాలన్నారు. ప్రతి కార్డుదారుడికి తప్పనిసరిగా రేషన్‌సరుకులు అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఆక్రమణలను ఉపేక్షించవద్దు



సమీక్షిస్తున్న కమిషనర్ అదితిసింగ్

తిరుపతి తుడా: నగరంలో ఆక్రమణలను ఉపేక్షించవద్దని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితిసింగ్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం 'మీ కోసం –ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో ప్రజా ఫిర్యాదులపై సమీక్ష నిర్వహించారు. ఆమె అధికారులతో మాట్లాడుతూ నగరంలోని ఫుట్‌పాత్‌లు, కాలువలపై ఉన్న ఆక్రమణలను తొలగించాలని సూచించారు. నగరంలో మరింత మెరుగ్గా పారిశుధ్యాన్ని అమలు చేయాలని ప్రజారోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. యూడీఎస్ మ్యాన్‌హోల్ ఓవర్‌ఫ్లోను అరికట్టేందుకు ఇంజినీర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. అడిషనల్ కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, కె.ఎల్.వర్మ, డిప్యూటీ సిటీ ప్లానర్ శ్రీనివాసులురెడ్డి, అడిషనల్ సిటీ ప్లానర్ బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

రుయా ఇన్‌చార్జి ఏడీగా రమేష్

తిరుపతి తుడా: తిరుపతి రుయా ఆసుపత్రి ఇన్‌చార్జ్ ఏడీ(అసిస్టెంట్ డైరెక్టర్)గా పరిపాలనా అధికారి ఎం.రమేష్‌ను నియమించారు. ఈ మేరకు ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఏడీగా పని చేసిన రత్నరాజు ఆదివారం పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో పరిపాలన అధికారి రమేష్‌ను ఇన్‌చార్జ్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా ఆయనకు ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు రాజా, ఇతర కార్యవర్గం ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యా సామగ్రి పంపిణీ



సరస్వతి పూజ చేస్తున ఉపాధ్యాయులు, దాతలు

నాగలాపురం: మండలంలోని రాజుల కండ్రిగ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎంఈఓలు బాబయ్య, జనార్ధనరాజు ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం, నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో దాతలు సీతారామరాజు, ఏఎస్ రాజు, సుధీర్‌తో కలిసి ఎంఈఓ విద్యార్థులకు పెన్నులు, నోటు పుస్తకాలు, వితరణ చేశారు. దాతలు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విశ్రాంత సీఐ జయచంద్రరాజు, ఉపాధ్యాయులు, స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ ప్రసాద్ రాజు, చంద్ర, ప్రభాకర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు

తడ: స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రవేశం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ దేవదానం తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని, ఆసక్తి కల వారు వెబ్ సైట్‌లో ఈ నెల 24వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 25న సర్టిఫికెట్ల వెరిఫికేషన్, 27, 28 తేదీల్లో కౌన్సిలింగ్ ఉంటుందని తెలిపారు. వివరాలకు 79935 68224లో సంప్రదించాలని కోరారు.

వైభవంగా వార్షికోత్సవం



ఊరేగుతున్న స్వామి అమ్మవారు

రాపూరు: రాపూరు సమీపంలోని మద్దెలమడుగు వద్ద ఉన్న మహావిష్ణువు, అయ్యప్పస్వామి ఆలయాల తృతీయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ఉదయం 5 గంటలకు అభిషేకం, 6 గంటలకు పూలంగి సేవ, 10.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత మహావిష్ణువుకు కల్యాణం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను గరుడ వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం చేశారు. అయ్యప్ప, వినాయకుడు, సుబ్రమణ్యస్వామి ఉత్సవ విగ్రహాలను ట్రాక్టర్‌లో కొలువుతీర్చి ఊరేగించారు. ఆలయ నిర్వాహకులు తిలక్‌రెడ్డి, గోపీచంద్, డాక్టర్ చంద్రశేఖర్, మస్తాన్ బాబు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



స్వామి, అమ్మవార్ల కల్యాణం చేస్తున్న అర్చకులు

గ్రామాభివృద్ధికి నా వంతు కృషి చేస్తా



మాట్లాడుతున్న సర్పంచ్ మోహనప్రియ

ఏర్పేడు: గ్రామాభివృద్ధికి తమ వంతు కృషిచేస్తామని సర్పంచ్ మోహనప్రియ అన్నారు. మండలంలోని ఎండీ పుత్తూరులో సమస్యల పరిష్కారంపై సోమవారం గ్రామ సభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామ సభలో పలు సమస్యలపై వార్డు సభ్యులు, గ్రామస్తులు తమ దృష్టికి తీసుకుని వచ్చినట్లు చెప్పారు. గ్రామాల్లోని మురుగునీటి కాల్వలపై బండల ఏర్పాటు, ఓవర్‌హెడ్ ట్యాంకుల పైకప్పు మరమ్మతులు, యల్లమ్మ తల్లి ఆలయం వద్ద ఉన్న కుళాయి లీకేజీ మరమ్మతులు చేపట్టాలని ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. సమస్యలను ఎంపీడీఓ దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పద్మమ్మ, మాజీ సర్పంచ్‌లు భాస్కరయ్య, దొరస్వామి, కేశవులు, రమేష్, ఉప సర్పంచ్ గౌరి, పంచాయతీ కార్యదర్శి లోకముని, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసరావు

సత్యవేడు: నూతనంగా వెలువడిన భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత(బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్యా అధీనియం(బీఎస్ఏ) న్యాయ చట్టాలపై ప్రజలు, విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం సాయంత్ర సర్కిల్ కార్యాలయం ఆవరణలో మూడు నూతన చట్టాలపై పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ జూలై 1వ తేదీ నుంచి నూతన చట్టాలు అమల్లోకి వచ్చాయన్నారు. నూతన సెక్షన్ల నమోదులో ఎస్‌హెచ్‌ఓలు పొరబాట్లు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రతి ఒక్కరూ చట్టంలో వచ్చిన మార్పులను తెలుసుకోవాలని సూచించారు. సత్వర న్యాయమే కొత్త చట్టాల అమలు ప్రధాన లక్ష్యమన్నారు. ఎఫ్ఐఆర్ సౌలభ్యం, పోలీస్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేసే విధానం, జీరో ఎఫ్ఐఆర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ దివాకర్ రెడ్డి, ఎస్.వీరాంజనేయులు, స్థానికులు పలువురు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి దివాకర్

బుచ్చినాయుడుకండ్రిగ: బుచ్చినాయుడుకండ్రిగలోని బీసీ హాస్టల్‌లో సోమవారం వైద్యాధికారి దివాకర్, ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు, ఎంఈఓ రవీంద్రనాథ్ స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని ప్రారంభించి, సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో ముఖ్యంగా రెండు రకాల సీజనల్ వ్యాధులు ఉంటాయన్నారు. కలుషితమైన నీటిని తాగడం వల్ల, ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల టైఫాయిడ్, డయేరియా నీళ్ల విరోచనాలు వ్యాధులు వస్తాయని, రెండోది దోమల ద్వారా వచ్చే వ్యాధులు, దోమల వల్ల మలేరియా, వైరల్ ఫీవర్, డెంగీ, చికెన్ గున్యా వంటి వ్యాధులు వస్తాయన్నారు. ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే కొంత వరకు వ్యాధులను అరికట్టవచ్చన్నారు. వైద్యసిబ్బంది సూచనలు పాటిస్తే వ్యాధుల బారి నుంచి కాపాడుకోవచ్చని తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలన్నారు. కుష్టు వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వార్డెన్ రామయ్య, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బస్సు సర్వీసును సద్వినియోగం చేసుకోండి



బస్సు సర్వీసును జెండా ఊపి ప్రారంభిస్తున్న మేనేజర్ రామకృష్ణ

ఏర్పేడు: విద్యార్థులు బస్సు సర్వీసును సద్వినియోగం చేసుకోవాలని వెంకటగిరి ఆర్టీసీ డిపో మేనేజరు రామకృష్ణ అన్నారు. మండలంలోని పల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జెండా ఊపి బస్సు సౌకర్యాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చుట్టు పక్కల గ్రామాల నుంచి విద్యార్థులు హాజరవుతున్నట్లు వివరించారు. ప్రతి రోజు విద్యార్థులు ఆటోలకు చార్జీలు చెల్లించి వెళ్లడం కష్టతరంగా ఉందని డీపీటీఓ చెంగల్‌రెడ్డికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆనంద్ ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. డీపీటీఓ ఆదేశాల మేరకు బస్సు సర్వీసు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ మాజీ చైర్మన్ చంద్రశేఖర్ నాయుడు, ఉపాధ్యాయులు కేవీబాబు, రెడ్డెప్ప, వెంకటరామయ్య, రామసుబ్బమ్మ, పుష్పవాణి, సోమశేఖర్ రాజు, శ్రీరాములు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం



డాక్టర్స్ డే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం



యూత్ హాస్టల్‌లో అవగాహన కార్యక్రమం

తిరుపతి తుడా: క్యాన్సర్ మహమ్మారి చాప కింద నీరులా విస్తరిస్తోందని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం అన్నారు. అంతర్జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా స్థానిక యూత్ హాస్టల్‌లో సోమవారం తిరుపతి డివిజన్ కమ్యూనిటీ పారా మెడికల్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. వ్యాధిని ఆదిలోనే గుర్తిస్తే సమస్యను విజయవంతంగా అధిగమించవచ్చని ఆయన స్పష్టం చేశారు. అసోసియేషన్‌లో ఇలాంటి అవగాహన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. దామోదర్ రెడ్డి, అసోసియేషన్ నాయకులు వేణు, మంజుల, ప్రేమ్ కుమార్, కల్పన, రామచంద్ర భూపతి, విజయ్ కుమారులు పాల్గొన్నారు.

రష్‌లో ఘనంగా డాక్టర్స్ డే

తిరుపతిలోని రష్ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో సోమవారం డాక్టర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి అధినేత ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం పాల్గొని వైద్యుల బాధ్యతలను గుర్తు చేశారు. రోగులకు నాణ్యమైన వైద్యాన్ని అందించడంపై వైద్యులు దృష్టి సారించాలని కోరారు. రష్ వైద్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ సిపాయి కీర్తి సాగర్‌రెడ్డి, డాక్టర్ సిపాయి మౌనరెడ్డి, డాక్టర్ కృష్ణ కాంత్, గౌరీ, చందన కుమార్, డాక్టర్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై వ్యక్తి హల్‌చల్



తీవ్రంగా గాయపడిప అసోం వాసికి ప్రథమ చికిత్స చేస్తున్న 108 సిబ్బంది

నాయుడుపేట టౌన్ : మండలంలోని అయ్యప్పరెడ్డి పాళెం జాతీయ రహదారి కూడలి వద్ద సోమవారం తీవ్ర గాయాలతో ఉన్న ఒక యువకుడు రోడ్డుపై నిలుచుకుని వచ్చిపోయే వాహనాలను నిలిపివేస్తూ, బైక్‌ల మీద వచ్చే వారిని కింద పడేస్తూ హల్ చల్ చేశాడు. పోలీసుల కథనం మేరకు.. అసోం ప్రాంతానికి చెందిన కొంతమంది యువకులు పనుల కోసం బెంగళూరుకు రైలులో బయలుదేరారు. మండలంలోని అయ్యప్పరెడ్డిపాళెం గ్రామ సమీపంలో మొగట్ సింగ్ అనే యువకుడు రైలు నుంచి పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతను జాతయ రహదారిపైకి చేరుకున్నాడు. తీవ్ర రక్త స్రావం అవుతున్నా పట్టించుకోకుండా మతి భ్రమించిన వాడిలా రోడ్డు మధ్య నిలిచి వాహనాలను నిలిపి వేస్తూ గందరగోళం సృష్టించాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ గోపి, హెడ్ కానిస్టేబుల్ మధు అక్కడికి చేరుకుని 108 అంబులెన్స్‌ను పిలిపించి అతనికి చికిత్స చేయించారు. అనంతరం గూడూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. రైలు నుంచి పడిపోయిన సంఘటనపై గూడూరు రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మెరుగైన సేవల్లో అగ్రగామి ఎల్ఐసీ

పుత్తూరు: ప్రజలకు మెరుగైన సేవలందించడంలో దేశంలోని అగ్రగామి సంస్థల్లో ఎల్ఐసీ ఒకటని అఖిలభారత భీమా ఉద్యోగుల సంఘం (ఏఐఐఈఏ) పుత్తూరు శాఖ కార్యదర్శి ఎస్.లక్ష్మణకుమార్ అన్నారు. సోమవారం సంఘ ఆవిర్భావ దినోత్సవాన్ని బ్రాంచి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తొలుత యూనియన్ ఉపాధ్యక్షుడు జి.వెంకటేష్ యూనియన్ జెండాను ఎగురవేశారు. ఈనెల 2న ప్రభుత్వ ఆస్పత్రులోని రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ, 3వ తేదీ ఉచిత మెగా మెడికల్ క్యాంపు, 5న బ్రాంచ్ కార్యాలయం వద్ద రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు వివరించారు.